ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 9 ఏప్రిల్ 2025



నీటి పన్ను వసూళ్లపై దృష్టి పెట్టండి: జేసీ

కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను జేసీ సేతుమాధవన్ ఆదేశించారు. తహసీల్దార్లు, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. నీటి పన్ను వసూళ్లు శరవేగంతో పూర్తి చేయాలన్నారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా పరిష్కరించాలని చెప్పారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. 22ఏ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదని, రీసర్వేలో తప్పులు లేకుండా చూడాలని సూచించారు.

ఉత్తుత్తి హామీలు!

క్వారీలకు అనుమతి ఇవ్వడం కోసం ప్రజావేదికలు ఏర్పాటు చేయడం.. ప్రజలు లేవనెత్తిన అభ్యంతరాలకు అధికారులు సరే అనడం.. ఆపై అండగా ఉంటామని.. గ్రామాన్ని అన్నింటా అభివృద్ధి చేసేస్తామని నిర్వాహకులు హామీ లివ్వడం.. ఉపాధి చూపుతామని భరోసా ప్రకటించడం.. తీరా క్వారీ ఏర్పాటు చేశాక వీటన్నింటినీ విస్మరించడం జిల్లాలో సర్వసాధారణంగా మారింది. క్వారీ వల్ల ఇబ్బంది పడుతున్నామని, బతకలేకపోతున్నామని చెప్పినా వినే నాథుడు ఉండడం లేదు. వేపాడ మండలంలోని పెదదుంగాడ, చినదుంగాడ, కొలికిపాలెం గిరిజన గ్రామాలకు ఆనుకుని నడుస్తున్న క్వారీలు ఇందుకో ఉదాహరణ. ఆయా గ్రామాల గిరిజనుల కన్నీటిగోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎస్.కోట మండలంలోని ధర్మవరంలోనూ ఇదే పరిస్థితి.


రిగ్గు యంత్రంతో భారీగా తవ్వకాలు

- మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ
- ఎన్నో చేస్తామంటారు.. కానీ ఆచరణ శూన్యం
- ఉపాధి అవకాశాలనూ పట్టించుకోని వైనం
- భారీ పేలుళ్లతో ప్రజలకు నరకయాతన
- వేపాడ, ఎస్.కోట మండలాల్లో క్వారీలతో అవస్థలు


క్వారీ లారీని అడ్డుకున్న గిరిజనులు(ఫైల్)

వేపాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)

వేపాడ మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు పెదదుంగాడ, చినదుంగాడ, కొలికిపాలెం గిరిజన గ్రామాల ప్రజలకు తాత ముత్తాతల నుంచి పోడు వ్యవసాయమే జీవనాధారం. ఈ గ్రామాలకు ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 7, సర్వే నెంబరు 45లలో రాతి మెట్టలపై వీరు వివిధ పంటలను పండించుకునేవారు. ఆ మెట్టలపై క్వారీ కోసం కొన్నేళ్ల కిందట కొందరు వ్యక్తులు దరఖాస్తు చేశారు. దీనిపై గిరిజనుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు జిల్లా పొల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో ప్రజావేదికల పేరుతో అప్పట్లోనే పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేశారు. క్వారీ వస్తే తమకు ఉపాధి పోతుందని, కుటుంబ పోషణ కూడా భారమవుతుందని గిరిజనులు గోడు వెళ్లబుచ్చారు. దీనిపై అధికారులు స్పందిస్తూ క్వారీలు వస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుందని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, రహదారులు వేయిస్తామని చెప్పుకొచ్చారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజారోగ్యం కాపాడతామన్నారు. గిరిజనులు ఆ మాటలను నమ్మి అంగీకరించారు. క్వారీలు ప్రారంభించాక గిరిజనులు ఊహించని ఘటనలే జరుగుతున్నాయి. భారీ పేలుళ్లకు నిత్యం టెన్షన్ పడుతున్నారు. ఆ శబ్దాలకు ఇళ్ల గోడలు పగుళ్లిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. క్వారీల వల్ల మిగతా చోట్ల కూడా పంటలు (మిగతా 8వ పేజీలో..)

వ్యతిరేకించినా పట్టించుకోలేదు..

- ధర్మవరంలో గుట్టుచప్పుడు కాకుండా క్వారీ నిర్వహణకు అనుమతులు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట మండలంలోని ధర్మవరం రెవెన్యూ పరిధిలో 2022 సెప్టెంబరు 17న నాటి వైసీపీ ప్రభుత్వంలో 3.33 ఎకరాల్లో క్వారీ ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అప్పటి డీఆర్‌వో గణపతిరావు ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. సదస్సు ప్రారంభం నుంచి ముగిసే వరకు నూటికి నూరుశాతం ప్రజలు అక్కడ క్వారీ వద్దని, కేవలం 25 మందికి ఉపాధి (మిగతా 8వ పేజీలో..)


క్వారీ వద్దకు పేలుడు సామగ్రిని తీసుకొచ్చిన వాహనం


వీఆర్ అగ్రహారం, వీఆర్ పేటకు సరిహద్దు ఈ రోడ్డే

కలివిడిగా..

- ఆ రెండు గ్రామాలు ప్రత్యేకం
- రోడ్డు సరిహద్దుగా అన్నీ రెండేసి
- రెండు పంచాయతీలు, రెండు మండలాలు
- ఇద్దరు సర్పంచులు, ఇద్దరు ఎమ్మెల్యేలు

రాజాం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వెంకటరాయుని అగ్రహారం.. (వీఆర్ అగ్రహారం).. ఏకపట్టా అగ్రహారం.. బ్రాహ్మణ అగ్రహారం.. అని కూడా పిలుస్తారు. ఒకప్పుడు ఊరొక్కటే.. కాలంతో పాటు వచ్చిన మార్పులకు రెండుగా వేరయ్యాయి. రెండు గ్రామాలకు మధ్య రోడ్డే సరిహద్దు. వారంతా పక్కపక్కనే ఉంటున్నప్పటికీ రెండు పంచాయతీలు.. రెండు మండలాలు, రెండు రెవెన్యూ డివిజన్లు, రెండు నియోజకవర్గాలలో ఉన్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలు.. ఇద్దరు కలెక్టర్లు.. అక్కడితో ఆగకుండా రెండు తాగునీటి పథకాలు.. రెండు పాఠశాలలు.. ఇలా అన్నీ రెండేసే.. ఎంపీ మాత్రం ఒక్కరేనండోయ్.

రాజాం మండలంలో...

వీఆర్ అగ్రహారం.. పూర్వం రాజులు బ్రాహ్మణులకు ఇచ్చిన ఏకపట్టా అగ్రహారంగా చెబుతారు. కాలక్రమంలో గ్రామంలోని తూర్పున అన్ని కులాలకు చెందినవారు ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తూ వచ్చారు. ఇళ్లు పెరిగాక ఆ ప్రాంతాన్ని పేటగా పిలవడం ప్రారంభించారు. రాను రాను వీఆర్ అగ్రహారంలో వీఆర్‌పేట అంతర్భాగంగా మారింది.

రాజకీయ మార్పుతోనే..

1987లో మండల వ్యవస్థ ప్రారంభమైన సమయంలో చీపురుపల్లి ఎమ్మెల్యేగా ఉన్న గద్దె బాబూరావు అనుచరుడు వీఆర్ పేటకు చెందిన దివంగత జనపాల బాలకృష్ణ రాజకీయ అరంగేట్రం చేశారు. దీంతో వీఆర్ పేటను జి.సిగడాం మండలంలో చేర్పించేలా గద్దె బాబూరావు ప్రయత్నించారు. ఫలితంగా వీఆర్ పేట జి.సిగడాం మండలంలో విలీనమైంది. వీఆర్ అగ్రహారం రాజాం మండలంలో ఉండిపోయింది. అప్పట్లో జి.సిగడాం మండలం చీపురుపల్లి నియోజకవర్గంలో ఉండేది. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లాలో ఉంది.

అన్నీ రెండేసి..

వీఆర్ అగ్రహారం... వీఆర్‌పేటలు పక్కపక్కనే ఉన్నా అన్నింటా వేర్వేరే.. వీఆర్ అగ్రహారం రాజాం మండలం, రాజాం నియోజకవర్గం, చీపురుపల్లి రెవెన్యూ డివిజన్, విజయనగరం జిల్లాలో ఉంది. వీఆర్ పేట నాగులవలస పంచాయతీ, జి.సిగడాం మండలం, ఎచ్చెర్ల నియోజకవర్గం, శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్, శ్రీకాకుళం జిల్లాలో ఉంది. ఒకే గ్రామంగా ఉన్న రెండు ప్రాంతాలకు సంబంధించి ఇద్దరు సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీలు, ఇద్దరు జడ్పీటీసీలు, ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. రాజాం, ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గాలు విజయనగరం లోక్‌సభ పరిధిలో ఉండడంతో (మిగతా 8వ పేజీలో..)

ఆ రూ.కోటిన్నర ఏమైంది?

- డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా! ● అలజంగిలో వెలుగుచూసిన ఘటన ● ఎమ్మెల్యే బేబీనాయనకు ఫిర్యాదు


ఎమ్మెల్యే బేబీనాయనకు సమస్యను వివరిస్తున్న డ్వాక్రా మహిళలు

బొబ్బిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

బొబ్బిలి మండలం అలజంగి గ్రామంలోని డ్వాక్రా సంఘాలకు చెందిన సుమారు రూ.కోటిన్నరకు పైగా సొమ్ము స్వాహా జరిగినట్లు ఆ గ్రామ డ్వాక్రా మహిళలు మూకుమ్మడిగా ఆరోపిస్తున్నారు. అలజంగి నుంచి వందలాదిగా మహిళలు మంగళవారం బొబ్బిలి కోటకు వచ్చి ఎమ్మెల్యే బేబీనాయన ముందు లబోదిబోమన్నారు. డ్వాక్రా సొమ్ము స్వాహాపై విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామంలో 108 మహిళా గ్రూపులు ఉండగా వారి పొదుపు ఖాతాల పుస్తకాలన్నీ గ్రామ వీఓఏ వద్ద ఉన్నాయి. పొదుపు డబ్బులను ఆమెకు సభ్యులు అందజేస్తుంటారు. ఆమె బ్యాంకుకు వెళ్లి చెల్లిస్తుండేది. అయితే కొంతకాలంగా సభ్యుల వాయిదాల సొమ్ములను వీఓఏ సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లు తాజాగా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. కొన్ని సంఘాల ఖాతాలలో ఉన్న పొదుపు సొమ్మును సభ్యులకు తెలియకుండానే ఆమె విత్‌డ్రా చేశారని, అలాగే సభ్యులిచ్చిన వాయిదాల సొమ్ము చెల్లించకపోవడంతో ఆ సభ్యులు డిఫాల్టర్లు అయ్యారని, రుణం, వడ్డీ రోజురోజుకు పెరిగిపోతూ వస్తున్నాయని వారంతా ఎమ్మెల్యే ముందు వాపోయారు. తీర్మానాల పుస్తకాలను ఆమె వద్దనే ఉంచడంతో విషయం ఆలస్యంగా బయటకు పొక్కింది.

- ఎమ్మెల్యే బేబీనాయన స్పందిస్తూ ఏపీఎం భాగ్యలక్ష్మిని రప్పించారు. మహిళలందరికీ తక్షణం న్యాయం జరగాలని ఆమెకు స్పష్టం చేశారు. గ్రామానికి వెళ్లి అన్ని సంఘాల లెక్కలు, లావాదేవీలపై సమగ్రంగా విచారణ జరిపిస్తామని భాగ్యలక్ష్మి స్పష్టత ఇచ్చారు.

రెండు రోజుల్లో వివరణ ఇవ్వండి

- వైద్యాధికారులకు ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయాధికారి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న 'ఉడకని అన్నం.. పాచి పోయిన కూర ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయాధికారి అప్పారావు సీరియస్‌గా స్పందించారు. కథనంలో వెల్లడించిన ఆస్పత్రుల లోపాలపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆయా వైద్యాధికారులను మంగళవారం ఆదేశించారు. గజపతినగరం, బొబ్బిలి, ఎస్.కోట ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లకు మెమో జారీ చేశారు. భోజనం, అల్పాహారం రుచికరంగా లేవని, తగినంతగా ఇవ్వడంలేదని రోగులనుంచి వచ్చిన ఫిర్యాదుపైనా స్పందించాలని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో జరుగుతున్న అక్రమాలపై కొద్దిరోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న కథనాలు జిల్లా అంతటా చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికారి స్పందించి ఆస్పత్రుల అధికారులను వివరణ కోరారు.

వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టు పూర్తి

- దేశంలోనే అధునాతన విమానాశ్రయంగా అభివృద్ధి
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

భోగాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తవుతుందని, విమానాశ్రయ నిర్మాణంతో ఉత్తరాంధ్ర రూపురేఖలే మారనున్నాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. భోగాపురంలో నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా ట్రంపెట్ వద్ద నుంచి పర్యటించారు. పనులు ఏవిధంగా జరుగుతున్నాయి.. ఎంత వరకు జరిగాయి... ఇంకా ఎంత మేర ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయని, అనుకొన్న సమయం కన్నా ముందే వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. గత నవంబరులో సుమారు 49శాతం పనులు కొలిక్కి వచ్చాయని, నేటికి 71 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అధునాతన ఎయిర్‌పోర్టులైన ముంబయి, నోయిడా, భోగాపురం ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో దేశం రూపురేఖలు మారనున్నాయన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మిస్తున్నామని, ఇది దేశంలోనే అతి పెద్ద రన్‌వే అని అన్నారు. స్థానికంగా స్కిల్ డవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎయిర్‌పోర్టు, ఇతర ఎకనమిక్ కార్యకలాపలకు, వ్యాపార అభివృద్ధికి శిక్షణ ఇస్తామన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెంచడానికి కృషి చేస్తామని చెప్పారు. ఎయిర్‌పోర్టు ప్రారంభించే నాటికి తాజ్ గ్రూప్ హోటల్ కూడా ప్రారంభించేలా చూస్తామన్నారు. ఉత్తరాంధ్ర సంస్కృతీ సంప్రదాయం, కళలు ఉట్టిపడేలా విమానాశ్రయ ఇంటీరియర్ డిజైన్ ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సూచనలతో సంబంధిత కేంద్రమంత్రితో చర్చించి అనకాపల్లి, ఆనందపురం బైపాస్ రహదారిని భోగాపురం విమానాశ్రయానికి కనెక్ట్ చేసేలా ప్రయత్నిస్తామన్నారు. ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్యలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని... రహదారులు, అప్రోచ్‌రోడ్డు తదితర సమస్యలను ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు బైరెడ్డిపాలెం, కంచేరు, దల్లిపేట, గూడెపువలస, రాయవలస తదితర గ్రామాలకు చెందిన రైతులు కేంద్రమంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. పరిహారం అందేలా చూడాలని కోరారు. కేంద్ర మంత్రి వెంట మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్, ఆర్డీవో డి.కీర్తి, జీఎంఆర్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు. అంతకుముందు అశోక్‌గజపతిరాజును కేంద్రమంత్రి కలిశారు.


ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

పశు బీమా.. రైతులకు ధీమా



- ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల వరకు వర్తింపు
- రాయితీ వర్తింపజేస్తున్న ప్రభుత్వం
- మార్గదర్శకాలు జారీ
- మన్యం జిల్లాలో 62 శాతం పూర్తి
- మిగిలిన వారికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)

పశు బీమా విషయంలో ప్రభుత్వం విధివిధానాలను విడుదల చేసింది. వాటిని కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఈ బీమా సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొంది. ఇప్పటికే పశు సంవర్ధక శాఖ సూచనల మేర కు జిల్లాలో కొందరు రైతులు బీమా చేయించుకున్నారు. బీమా ప్రీమియం కింద రైతు వాటాగా రూ.21 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు అధికారులు 62 శాతం రాబట్టారు. మిగి లిన పాడి రైతులు కూడా బీమా ప్రీమియం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.



విక్రంపురంలో ఆవును పరిశీలిస్తున్న జేడీ మన్మథరావు

పశు సంపద ఇలా..

మన్యం జిల్లా పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో గరుగుబిల్లి, కురుపాం, పాలకొండ, పార్వతీపురం, సీతానగరం, సీతంపేట, సాలూరులో పశు వైద్యశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో పశు వైద్య ఆసుపత్రులు 38, గ్రామీణ పశు వైద్య యూనిట్లు 35 ఉన్నాయి. 2019 గణాంకాల ప్రకారం ఆవులు 2.29 లక్షలు, గేదెలు 47 వేలు, గొర్రెలు 2.07 లక్షలు, మేకలు 1.73 లక్షలు, కోళ్లు 8.11 లక్షలు కలిపి మొత్తం 14.67 లక్షలు పశు సంపద జిల్లాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో కోళ్లు 8.11 లక్షలు తీయగా 6.56 లక్షల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు ఉన్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోంది. పాడి రైతులు వాటికి బీమా ప్రీమియం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది.

బీమా ఇలా...

- ప్రతి పాడి రైతుకు గరిష్ఠంగా పది పశువుల వరకు బీమా వర్తిస్తుంది.
- ఒకసారి బీమా చేస్తే.. మూడేళ్ల వరకు వర్తిస్తుంది.
- ప్రతి పశువుకూ చెవి పోగు వేయించి బీమాలో నమోదు చేయించుకోవాలి.
- ఒకవేళ చెవి పోగు పోతే వెంటనే పశు సంవర్ధక శాఖ సిబ్బందికి తెలియజేసి మరొకటి వేయించాలి.
- నాటు పశువులకు రూ.816, మేలు జాతికి చెందిన వాటికి రూ.1,632 మేర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది.
- పశు బీమా రూ. 15 వేలు అయితే ప్రీమియం రూ. 960. ఇందులో ప్రభుత్వం రూ. 816లు భరిస్తుంది. మిగిలిన రూ. 149 రైతు వాటా కింద చెల్లించాల్సి ఉంటుంది.
- మిగిలిన ప్రీమియం పశువుకు కట్టిన విలువ బట్టి ఉంటుంది. అయితే అది ఎంత అయినప్పటికీ ప్రభుత్వం రూ.1,632 మాత్రమే భరిస్తుంది. మిగతాది రైతు తన వాటా కింద చెల్లించాలి.

మేకలు, గొర్రెలు, పందులకైతే...

- మేకలు, గొర్రెలు, పందుల విషయంలో ఒక్కొక్క దాని బీమా రూ. 6 వేలు. తెల్ల కార్డు ఉన్న పాడి రైతు సంవత్సరానికి వంద జీవాలకు పశు బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చు.
- సంవత్సరానికి బీమా మొత్తం రూ. 6 వేలు కాగా 3 శాతం ప్రీమియం చెల్లిస్తే చాలు. వీటికి చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం రూ. 180 కాగా, ప్రభుత్వం 85 శాతం రాయితీ అంటే రూ. 153 భరిస్తుంది. లబ్ధిదారుని వాటా మాత్రం కేవలం రూ. 27 మాత్రమే.
- రెండేళ్లకైతే కట్టాల్సిన ప్రీమియం రూ.270. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ. 230, లబ్ధిదారుని వాటా రూ. 40లు మాత్రమే.
- మూడేళ్లకైతే చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం రూ. 375. ప్రభుత్వ రాయితీ రూ. 319, లబ్ధిదారుని వాటా రూ. 5 మాత్రమే.
- పశువులు ప్రమాదవశాత్తూ లేక రోగాలకు గురై మరణిస్తే.. వాటి ధరను బట్టి పాడి రైతులకు బీమా మొత్తం చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



పశు బీమాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే లబ్ధిదారుని వాటా కింద 62 శాతం ప్రీమియం వసూలు చేశాం. ప్రభుత్వ లక్ష్యాల మేరకు మిగతా పాడి రైతులతో కూడా పశు బీమా చేయిస్తాం.

-ఎస్.మన్మథరావు, జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, పార్వతీపురం మన్యం

మొండి బకాయిలు వసూలు చేస్తాం

- పీఏసీఎస్‌లలో సిబ్బంది కొరత ఉంది
- టిడ్కో లబ్ధిదారుల నుంచి రూ.14 కోట్లు రావాలి
- డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజయనగరం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, అనుబంధ శాఖలకు సం బంధించి దీర్ఘకాలికంగా పేరుకుపో యిన మొండి బకాయిల వసూలుకు చర్యలు చేపడతాం. అవసరమైతే, టాప్-10 బకాయిదారులను గుర్తించి ఆస్తుల వేలం, భూముల స్వాధీనం వంటి కార్యక్రమాలు చేపడతాం. మొండి బకాయిల వసూలే లక్ష్యం. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణ ఏ జిల్లాలోనూ పూర్తికాలేదు. విజయనగరం జిల్లాలో పూర్తయినప్పటికీ సేవలు అంతంతమాత్రంగా ఉండ డానికి కారణం సిబ్బంది కొరత. అయినా గాని వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీని తీర్చిదిద్దుతాం' అని డీసీసీబీ సీఈవో సీహెచ్ ఉమమహేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తెలిపారు.

ప్రశ్న : డీసీసీబీ మొండి బకాయిల పరిష్కారం ఎలా?

జ: మొండి బకాయిలు వేధిస్తున్నాయి. 2018 నుంచి ఇదే పరిస్థితి. రూ. 25 కోట్ల వరకూ రావాల్సి ఉంది. వీటి వసూలుకు చర్యలు చేపడుతు న్నాం. బకాయిదారుల జాబితాను సిద్ధం చేస్తున్నాం. టాప్- 10 జాబితాను తీసుకుని వారి నుంచి బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. అవసరమైతే, చట్ట ప్రకారం, బ్యాంకు నిబంధనల ను అనుసరించి చర్యలు చేపడతాం. అవి వసూలైతే మరిన్ని రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది.

ప్రశ్న: పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ ఎంత వరకూ వచ్చింది?

జ: విజయనగరం ఉమ్మడి జిల్లా లో 94 పీఏసీఎస్‌లు ఉన్నాయి. విజ యనగరం జిల్లాలో 60, పార్వతీపురం మన్యంలో 34 పీఏసీఎస్‌లు ఉండగా వీటన్నింటిలో కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయింది.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా?

జ: పీఏసీఎస్‌ల ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. కాని సిబ్బంది కొరత ఉంది. ఈ కారణంగా ఖాతాదారులు, రైతులకు ఆశించిన స్థాయిలో సేవలు అంద డం లేదన్న అభిప్రాయం నెలకొంది. ఈ పరిస్థితిని సరి చేస్తాం. పీఏసీఎస్‌ల్లో ఖాళీల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.

ప్రశ్న: టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన రుణమెంత?

జ: టిడ్కో లబ్ధిదారులు వాయిదా లు కట్టడం లేదు. విజయనగరం, నెల్లిమర్ల, బొబ్బిలి ప్రాంతాల్లో చాలా మంది టిడ్కో ఇళ్లు అందలేదంటున్నా రు. ఈ ప్రభావం బ్యాంకుపై పడుతు న్నది. వారి నుంచి రూ.14 కోట్లు పెండింగ్‌లో ఉంది. అవి వసూలైతే మరింత మందికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: భవిష్యత్ ప్రణాళిక ఏంటి?

జ: వాణిజ్య బ్యాంకుల మాదిరిగా అన్ని రకాల రుణాలు ఇస్తున్నాం. రిక వరీ బాగుంది. అయితే ఏటీఎంలు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. వీటి స్థానంలో కొత్త ఏటీఎంలకు ప్రతిపాదనలు పంపాం. మొత్తం 12 ఏటీఎంలు ఉండగా 9 బ్యాంకు శాఖల వద్ద ఏర్పాటు చేశాం. మూడు మొబైల్ ఏటీఎంలు. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం.

అమెరికాలో 'తెలుగు మాటల' పోటీలు

- ప్రవాస భారతీయుల కోసం నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు



చప్ప గాంధీ, ప్రవాసభారతీయుడు

బొబ్బిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై పుట్టి... తెలుగులో మాట్లాడడం నామోషీగా భావిస్తున్న వారు అనేకం. వీరికి భిన్నంగా అమెరికాలో తెలుగు భాషకు విశేషమైన సేవలంది స్తున్న వారు ఎందరో ఉన్నారు. వారిలో బొబ్బిలి మండలం కమ్మవలసకు చెందిన చప్ప గాంధీ ఒకరు. అమెరికాలో స్థిరపడిన ఆయనకు తెలుగుభాష అంటే ఎనలేని అభిమానం. అక్కడ గల తెలుగు వారికి సిలికానాంధ్ర మన బడి ఆధ్వర్యంలో పాఠాలు చెప్పడం, కథలు, కవితలు రాయడం వంటివి చేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఈ నెల 5న మేరీల్యాండ్ రాష్ట్రంలోని బాల్టిమోర్లో నగరం (అమెరికా)లో 'తెలుగు మాట్లాట' పోటీలు నిర్వహించారు.

ఇలా విభజన..

ఐదు నుంచి ఏడేళ్ల లోపు పిల్లలను 'బుడతలు'గా... 8-11 ఏళ్ల మధ్య పిల్లలను 'సిసింద్రీలు'గా.. 13-16 మధ్య వయస్సు కలిగిన వారిని 'చిరుతలు' అని పేర్లతో విభజించారు. వీరికి పదరంగము, తిరకాటం, ఒనిమా (ఒక్క నిమిషంలో తెలుగులో మాట్లాడడం) వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 60 మంది పిల్లలు పాల్గొన్నారు. ఎటువంటి ఆంగ్ల పదాలు దొర్లకుండా పోటాపోటీగా పిల్లలంతా తెలుగులోనే మాట్లాడి బహుమతులను గెలుచుకున్నారని గాంధీ మంగళవారం తెలిపారు. పిల్లల భాషా ప్రావీణ్యానికి పదును పెడుతూ వారిలో సృజనాత్మక శక్తిని, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ పోటీలకు జాతీయ స్థాయిలో కిరణ్ పారూడి, మేరీల్యాండ్‌లో ప్రకాశ్ కర్రి, ప్రవీణ్ దేశరాజ్‌లు రూపకర్తలని తెలిపారు. నాగ ఆకెళ్ల, రఘోత్తం, పిన్నిరెడ్డి, జగదీశ్, రమ్యయశోద , గౌడ, మహేశ్ ఐత గాంధీ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారని వివరించారు. ముఖ్య నగరాలు, రాష్ట్రాలలో విజేతలైన వారు అమెరికా, కెనడా దేశాలలో నిర్వహించబోయే అంతర్జాతీయ స్థాయి తెలుగు మాట్లాడే పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని ఆయన చెప్పారు.



పోటీలో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు



చెట్టంతా కాయలే..

- బొప్పాయి మొక్కకు 72 కాయలు

ఈ బొప్పాయి చెట్టు విరగ్గాసింది. మొదలు నుంచి శివారు వరకూ కాయలే.. కాయలు. పదో... ఇరవయ్యో కాదు ఏకంగా 72 కాయలు ఉన్నాయి. తెర్లాం మండలం ఎన్.బూర్జవలసలో ఉందీ చెట్టు. ఇటీవల కాలంలో కొన్ని అరుదైన రకాల బొప్పాయి చెట్లు ఇలా కాస్తున్నాయని మండల ఉద్యాన శాఖాధికారి మోహనకృష్ణ తెలిపారు.

-తెర్లాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)

పుస్తకాలు వచ్చేస్తున్నాయ్

- కిట్లనూ సిద్ధం చేస్తున్న విద్యాశాఖ



రాజాం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. గతానికి భిన్నంగా పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఒకటి నుంచి పది తరగతులకు చెందిన విద్యార్థులు జిల్లాలో సుమారు రెండు లక్షల వరకూ ఉండొచ్చని జిలా విద్యా శాఖ అంచనా వేస్తోంది. ఈ సంఖ్య పెరిగే అవకాశాలు లేకపోలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు ఏయే తరగతులకు ఎన్నెన్ని పుస్తకాలు అవసరమో జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించింది. పాఠ్య పుస్తకాలతో పాటు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు కూడా అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది.

బరువు తగ్గింది..

- పిల్లలకు పుస్తకాలు భారం కాకుండా పాఠశాల విద్యాశాఖ యంత్రాంగం వివిధ సబ్జెక్టుల పుస్తకాలను ఒకేదానిలో కలిపి ముద్రిస్తోంది. ఫలితంగా పుస్తకాల సంఖ్య తగ్గుతోంది.
- గతంలో మూడు సెమ్‌లుగా ముద్రించేవారు. ప్రస్తుతం రెండు సెమ్‌లకే పరిమితం చేస్తున్నారు.
- 1-5 తరగతులకు చెందిన తెలుగు, ఇంగ్లీష్, గణితం కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. వర్క్‌బుక్‌ను అదనంగా చేర్చారు.
- 6-9 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ కలిపి ఒకే బుక్‌గా ముద్రించారు. ఎస్.ఎస్., పి.ఎస్. కలిపి ఒకటి చేశారు. గతంలో సాంఘిక శాస్త్రం మూడు పుస్తకాలు ఉండేది. ప్రస్తుతం ఒకటిగా అందించనున్నారు.
- పదో తరగతిలో హిందీ మారుతోంది.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచిన రెండు మూడు నెలల వరకూ విద్యార్థులకు పుస్తకాలు సరఫరా చేయలేని పరిస్థితి ఉండేది. కొంత సిలబస్ పూర్తయ్యాక పాఠశాలలకు పుస్తకాలు చేరిన సందర్భాలు అనేకం. దీంతో చాలా మంది విద్యార్థులు తమకు అవసరమైన పుస్తకాలను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసేవారు. గత ప్రభుత్వంలో కమిషన్లకు కక్కుర్తి పడి పాఠ్య పుస్తకాల ముద్రణను ముంబై, ఉత్తరప్రదేశ్‌లోని ప్రింటర్లకు అప్పగించేవారు. అక్కడ ముద్రించిన పుస్తకాలు సకాలంలో జిల్లాలకు చేరేవి కాదు. ఆ ప్రభావం విద్యార్థులపై పడేది. గత అయిదేళ్లలో విద్యార్థుల అవస్థలు గమనించిన అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇతర రాష్ట్రాలలో పాఠ్య పుస్తకాల ముద్రణకు స్వస్తి పలికారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ, తెనాలి తదితర ప్రాంతాల్లోని ప్రింటింగ్ ప్రెస్‌లకు అప్పగించారు. ఫలితంగా సకాలంలో విద్యార్థులకు పుస్తకాలు అందించేందుకు వెసులుబాటు కలగనుంది.

కిట్లలో ఏం ఉంటాయంటే...

ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర పేరుతో ఉచితంగా కిట్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఒక్కో కిట్‌లో ఒక బ్యాగ్, బెల్ట్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, మూడు జతల యూనిఫారాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, వర్క్‌బుక్ ఉంటాయి. గతంలో మాదిరిగా బూట్లు, దుస్తుల విషయంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే ఈసారి యూనిఫారాల రంగు మార్చారు.

నేరుగా పాఠశాలలకు..

జిల్లాలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలు తెరిచాక ఈ సంఖ్య కాస్త పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో పుస్తకాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చిన పుస్తకాలను నేరుగా పాఠశాలలకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-మాణిక్యంనాయుడు, డి.ఇ.ఒ., విజయనగరం



అమ్మవారి ఉత్సవంలో కాళికా వేషాలు

వైభవంగా దాడితల్లి ఊరేగింపు

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బొబ్బిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండుగను ప్రకటించి ఐదు వారాలైంది. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా మంగళవారం రాత్రి అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారి ఉత్సవం సందర్భంగా బళ్లవేషాలు, మహిళల కోలాటం తదితర ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఘటాలను ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండరుపై రూ.50 పెంపు

● జిల్లా వ్యాప్తంగా వినియోగదారులపై నెలకు రూ.75 లక్షల భారం



విజయనగరం, కలెక్టరేట్/ గరివిడి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగదారులపై బారం పడింది. వంట గ్యాస్ సిలిండరుపై రూ.50 పెంచుతూ కేంద్ర ప్రభుత్వ షాక్ ఇచ్చింది. సోమవారం గ్యాస్ సిలెండరు ధర రూ.810కు ఉండగా, మంగళవారం నాటికి రూ.860 అయింది. గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల తర్వాత మళ్లీ ఇప్పుడు గ్యాస్ ధర పెంచింది. గ్యాస్ ధర పెంచడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ పొందిన వినియోగదారులపై భారం పడింది. గతంలో ఎప్పుడు సిలెండర్ ధర పెంచినా రూ.20 నుంచి 30 వరకూ మాత్రమే పెరిగేది. అయితే ఈసారి మాత్రమే ఒక్కసారిగా రూ.50 పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 31 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 4,72,900 గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. నెలకు జిల్లాలో దాదాపు రాయితీ సిలెండర్లుకు సంబంధించి 1.50 లక్షల నుంచి నుంచి 1.80 లక్షల వరకూ సిలెండర్ల వాడకం జరుగుతుందని అధికారులు గణంకాలు చెబుతున్నాయి. సిలెండరుకు రూ.50 పెంచడంతో జిల్లా వ్యాప్తంగా వినియోగదారులపై సుమారు నెలకు రూ.75 లక్షలు వరకూ అదనపు భారం పడినట్టయింది.

డీబీసీడబ్ల్యూవోగా జ్యోతిశ్రీ

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా (డీబీసీడబ్ల్యూవో) జె.జ్యోతిశ్రీ మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖ నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

ఖజానా శాఖ డీడీగా నాగమహేశ్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజనా శాఖ డిప్యూటీ డైరెక్టరుగా వి.నాగమహేశ్ నియమతులయ్యారు. ఇప్పటి వరకూ డీడీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్.ఎ.ఎస్.కుమార్ నుంచి మంగళవారం నాగమహేశ్ బాధ్యతలు స్వీకరించారు.

ఏపీవోగా రత్నమాల

గుర్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీవోగా ఎస్.రత్నమాల మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన కామేశ్వరరావు దత్తిరాజేరు మండలం బదిలీ కావడంతో అతని స్థానంలో పూసపాటిరేగ మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

నెల్లిమర్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు లైన్ల నిర్వహణ పనులు, చెట్ల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని కొండవెలగాడ, చంద్రంపేట, టెక్కలి, ఎల్ఎన్.పురం, తుమ్మలపేట, తాళ్లపూడిపేట, పెదబూరాడపేట, చినబూరాడపేట, పారాసాం, గెద్దపేట, గుర్ల మండలంలోని భూపాలపురం, ఆనందపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. అలాగే రామతీర్థం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నేడు బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

నెల్లిమర్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విశాఖలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-19 బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే విజయనగరం జిల్లా జట్టు ఎంపిక పోటీలను నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట సత్య కాన్సెప్ట్ పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నిర్వహించనున్నట్టు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాళ్ల మహేష్ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1, 2008 డిసెంబరు 312 మధ్య జన్మించి ఉండాలన్నారు. బరువును బట్టి వివిధ కేటగిరిల్లో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

చీపురుపల్లిలో ధర్నా రేపు

చీపురుపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని మూడురోడ్ల కూడలిలో ఈనెల 10న వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని ఆ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం వారు పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు, ఉపాధి కూలీల వేతనాలు బకాయిలు చెల్లించనందుకు నిరసనగా ధర్నా తలపెట్టామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పతివాడ రాజారావు, అధికార్ల శ్రీనివాసరావు, చందక గురునాయుడు, రేవల్ల సత్యనారాయణ, కోరుకొండ దాలయ్య, మీసాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల సేవలపై అవగాహన

గజపతినగరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు సమకూరుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉప తహసీల్దారు శోభ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు అందుబాటులో ఉన్న సేవలను వివరించారు. సమస్యల పరిష్కారానికి అధికారుల సూచనల మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు జయబాబు, లక్ష్మి, జగదీశ్, లక్ష్మణరావు, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి రూ.85 వేల ఆర్థికసాయం

నెల్లిమర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగుబిల్లి గ్రామానికి చెందిన ఏలూరు నారాయణస్వామి అనారోగ్యంతో బాధపడుతుండటంతో అదే గ్రామస్థులు పెద్ద మనసు చాటు కున్నారు. ఆయన ఇటీవల శస్త్రచికిత్స కూడా చేయించుకున్నారు. ఆయన పరిస్థితిని తెలుసుకున్న స్థానికులు మానవతా దృక్పథంతో విరాళాలు సేకరించి రూ.85వేలు ఆర్థికసాయం చేశారు. గ్రామ పెద్దలు, యువకులకు నారాయణ స్వామి, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలోని ఉద్యోగుల కుటుంబ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మంగళవారం పోలీసు ఉద్యోగుల క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. పోలీసు సిబ్బంది ఆర్థిక అవసరాలకు అసరాగా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కృషి చేస్తోందన్నారు. 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన పది, ఇంటర్ విద్యార్థులకు రూ.1.87 లక్షల ఉపకార వేతనాలుగా అందజేశామన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా 2024-25 సంవత్సరానికి వచ్చిన ఆదాయ, వ్యయాలను పోలీసు సంక్షేమానికి తీసుకున్న చర్యలను సభ్యులకు వివరించామన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది పిల్లలు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐ ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఆర్ఐ గోపాల నాయుడు, కో-ఆపరేటివ్ సభ్యులు, ప్రతినిధులు నీలకంఠంనాయుడు, రామకృష్ణ, ఈశ్వరరావు, విజయచందర్, చిన్నారావు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం: ఏఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో అన్ని శాఖలు కృషి చేయాలని ఏఎస్పీ సౌమ్యలత అన్నారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖాధికారులతో పోలీసు కార్యాలయ ఆవరణలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.రాష్ట్రంలో గంజాయి, మత్తు, మాదకద్రవ్యాలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించిందన్నారు. ఇందుకు అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యం, డీఎస్‌జేవో మధుబాబు, ఎక్సైజ్ ఈఎస్ శ్రీనాథుడు, ఏఈఎస్ శ్రీరంగం, ప్రసాద్, విభిన్నప్రతిభావంతుల శాఖ అధికారి అన్నపూర్ణ, డ్రగ్ ఇన్‌స్పెక్టరు లలిత, జడ్పీ ఏవో త్రినాథరావు, జిల్లా సర్వైలెన్స్ అధికారి సత్యనారాయణ, సెట్విజ్ సీఈవో సోమేశ్వరరావు, ఈగల్ జేవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు ఇప్పించండి



వేతనదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది వారాలుగా వేతనాలు జమ కావడం లేదని ఉపాధి వేతనదారులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దృష్టిలో పెట్టారు. మంగళవారం శృంగవరపుకోట రాజుల చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల పరిశీలనకు వెళ్లిన ఆయనకు వేతనదారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మేట్లతో మాట్లాడారు. నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతో ఫొటోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నామని అందుకే ఆలస్యం అవుతుందని బదులిచ్చారు. మస్తర్లు నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయనకు వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి తదితరులున్నారు.

వంట మనిషిని నియమిస్తాం

● ఏబీసీడబ్ల్యూవో ప్రకటన



విద్యార్థులను విచారిస్తున్న ఏబీసీడబ్ల్యూవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భోగాపురం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న బీసీ బాలుర వసతిగృహంలో వంట మనిషిని నియమిస్తున్నట్టు ఏబీసీడబ్ల్యూవో రాజులమ్మ తెలిపారు. 'విద్యార్థులే వంట మనుషులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఆమె బీసీ బాలుర వసతిగృహాన్ని ఏబీసీడబ్ల్యూవో రాజులమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బందిని వేర్వేరుగా విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఇక్కడ తక్షణమే వంట మనిషిని (కుక్) నియమించడం జరుగుతుందన్నారు. ఆమెతో పాటు ఇన్‌చార్జి సంక్షేమ అధికారి చరణ్మయి ఉన్నారు.

ఏకగ్రీవంగా న్యాయవాదుల సంఘ ఎన్నిక



న్యాయవాదుల నూతన కార్యవర్గం

శృంగవరపుకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట న్యాయవాదుల సంఘ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన ఎన్నికలకు న్యాయాధికారి సబ్బవరపు వాణి హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా జి.సూరిదేముడు, కార్యదర్శిగా బీవీఎస్ రామారావు, కోశాధికారిగా బి.త్రిమూర్తులు, ఉపాధ్యక్షుడిగా బొడ్డు వెంకటరావు, సంయుక్త కార్యదర్శిగా బడమళ్ల రామకృష్ణ, మీడియా కార్యదర్శిగా డబ్ల్యూఎన్ శర్మ, లైబ్రరీ కార్యదర్శిగా ఆర్.సత్యనారాయణ, సభ్యులుగా టీవీఆర్ మూర్తి, జి.చిట్టిబాబు, వసంత శ్రీనివాసరావు, బోని శివశేఖర్‌బాబు, నెక్కల సత్యనారాయణ, వై.లక్ష్మిలను ఎన్నుకోన్నారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవాదులు మామిడి చంద్రశేఖర్, ఎం.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

జిల్లాలో పెరుగుతున్న క్యాన్సర్ రోగులు

● ఏపీలో ప్రజల ఆరోగ్యంపై సమగ్ర సర్వేలో వెల్లడి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్ ఇతర వ్యాధులతో కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. దీర్ఘకాలిక రోగాలతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రజల హెల్త్ ప్రొఫైల్‌పై ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేయించిన సర్వేలో ఈ విషయాలు వెలుగుచూశాయి. విజయనగరం, కాకినాడ, శ్రీకాకుళం జిల్లాల్లో క్యాన్సర్ రోగులు ఎక్కువ ఉన్నట్టు సర్వేలో తేలింది. జిల్లాలో 5,948 కేసులు నమోదైనట్టు తెలిపారు. శ్వాస సంబంధ వ్యాధులకు సంబంధించి విజయనగరం, నెల్లూరు, తిరుపతిలో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. ఇందులో విజయనగరం జిల్లాకు సంబంధించి 4,138 కేసులు నమోదైనట్టు గణాంకాలు వెల్లడించాయి. ఇక నరాలకు సంబంధించిన వ్యాధులకు సంబంధించి విజయనగరం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదయ్యాయి. ఇందులో జిల్లాకు సంబంధించి 6,485 కేసులు నమోదు అయ్యాయి. టీబీ (క్షయ), డెంగ్యూ, మలేరియా, డయేరియా కేసులు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎక్కువగా నమోదైనట్టు సర్వే పేర్కొంది. అనిమీయా (రక్తహీనత), ప్రీ టెర్మ్ బర్త్స్, పోషకాహార లోపం బాధపడుతున్న ఎక్కువగా విజయనగరం, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో ఎక్కువగా నమోదు అయినట్టు వెల్లడైంది. ఈ వ్యాధులపై ముందే అప్రమత్తత కావడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించి అవసరమైన చికిత్స నివారణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను విధించింది.

చంద్రశేఖర్‌కు మంత్రి పరామర్శ



చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న మంత్రి

దత్తిరాజేరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్‌ను మంగళవారం ఆయన స్వగ్రామం చుక్క పేటలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరామర్శించారు. సోమవారం ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి చంద్రశేఖర్ స్వల్ప గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి ఆయన ఇంటికి వెళ్లి అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట మాజీ మండల అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, టీడీపీ ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, నాయకులు బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వంగపండు కృష్ణమూర్తి నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్, మజ్జి మహేశ్ పాల్గొన్నారు.

క్రెడాయ్‌కి నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఛాప్టర్ క్రెడాయ్ చైర్మన్‌గా సీహెచ్ సూర్యనారాయణ రాజు ఎన్నికయ్యారు. ధర్మపురి రోడ్డులోని క్రెడాయ్ కార్యాలయంలో విజయనగరం ఛాప్టర్ 2025-27 నూతన కార్యవర్గ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, చెరుకూరి శ్రీధర్ వ్యవహరించారు. ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.రాజశేఖర్, కార్యదర్శిగా బి.సురేంద్ర, ఉపాధ్యక్షులుగా ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, ఎ.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా నారాయణం శేఖర్, ఎ.స్వామినాథ్, కోశాధికారిగా జి.నితీన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎ.శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్ రాజు, లయనేష్, శిల్పా నారాయణరావు, ఉల్లి కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీ



యూనిఫారాలను అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తవలస, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తవలస, వియ్యంపేట పీహెచ్‌సీలను మంగళవారం డీఎంహెచ్‌వో జీవనరాణి ఆకస్మికంగా సందర్శించారు. సంబంధిత వైద్యాధికారులతో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ లక్ష్యాలు, వాటిని అధిగమిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలలో మందులు, వ్యాక్సిన్‌ల నిల్వలను పరిశీలన చేశారు. ఆసుపత్రులలో ప్రసవాలు, రోజువారీ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయడం కృషి చేస్తోందని అందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలతో సమావేశమై యాప్‌లపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి యూనిఫారాలను అందజేశారు. ఆమెతో పాటు కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ, వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఉన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

వేపాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నవ ధాన్యాల సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి యశ్వంతరావు అన్నారు. మండలంలోని నీలకంఠరాజపురం రైతు సేవాకేంద్రంలో నువ్వుల్లో పీఎండీఎస్ కోసం విత్తనాలను సిద్ధం చేశారు. తొలకరిలో వేసే నువ్వు పంటలతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా ఏడురకాల విత్తనాలతో కిట్లును సిద్ధం చేశామన్నారు. ఒక కిట్టు రూ.100 రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నామన్నారు. మండలంలో 5 వేల ఎకరాలకు గాను 5 వేల కిట్లు తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం స్వామినాయుడు, ఎన్ఎఫ్ఏ వరప్రసాద్, శంకర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ కవచ్ పక్కాగా నిర్వహించాలి: డీఎస్పీ



సాగర్‌కవచ్‌పై సూచనలు చేస్తున్న డీఎస్పీ

భోగాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండలాల తీరప్రాంత గ్రామాల వెంబడి సముద్రంతో పాటు సముద్రం నుంచి జాతీయ రహదారికి చేరే మార్గాల్లో పక్కాగా నిర్వహించాలని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు పోలీసులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం సముద్రం నుంచి హైవేకు వచ్చే మార్గాలపై కోస్టల్ మెరైన్ ఎక్సర్ సైజ్ (సాగర్ కవచ్) నిర్వహించేందుకు పోలీసులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సముద్ర మార్గాన ఉగ్రవాదులు మన దేశంలోకి చొరబడి ముంబాయిలో దాడి చేసి ఎంతో నష్టాన్ని మిగిల్చిన విషయాన్ని గుర్తుచేశారు. మరలా అలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు ఏటా సాగర్‌కవచ్ మాక్‌డ్రిల్ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని 9న వేకువ జాము నుంచి 10న అర్ధరాత్రి వరకు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో 120 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. భోగాపురం సీఐ, ఎస్‌ఐలు ఎన్వీ ప్రభాకర్, వి.పాపారావు, మెరైన్ సీఐ, ఎస్‌ఐలు బి.వి.జె.రాజు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గంట్యాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నరవ గ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడు(45) ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి చెందారు. దీనికి సంబంధించి ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాల మేరకు. సోమవారం రాత్రి మృతుడు అప్పలనాయుడు ఎర్రచెరువులోకి స్నానం చేసేందుకు వెళ్లాడు. చెరువు లోతుగా ఉండటంతో కాలు జారి పడిపోయాడు. మంగళవారం ఉదయం చెరువులో మృతదేహం తేలియాడుతూ గ్రామస్థులకు కన్పించింది. ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం-కోరుకొండ రైల్వే స్టేషన్ సమీపంలో గుండాలపేట వద్ద రైలు పట్టాలపై మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు జీఆర్‌పీ హెచ్‌సీ కృష్ణారావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఎత్తు 5.5 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు, గ్రే కలర్ ఆఫ్ హ్యాండ్ టీ షర్టుపై చిన్నపూల డిజైన్, లేత బిస్కెట్ రంగు ఫుల్ ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9490617089, 94410 13330 నెంబర్లకు సమాచారం అందజేయాలని కోరారు.

కోడి పందేల శిబిరంపై దాడి

గంట్యాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొర్లాం సమీపంలో కోడి పందేల శిబిరంపై మంగళవారం సాయంత్రం గంట్యాడ పోలీసులు దాడి చేశారు. దాడితో 8 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.750 నగదు, 9 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రైవాడ కాలువలో ఆటో బోల్తా: తప్పినప్రమాదం

వేపాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బానాది, బల్లంకి మీదుగా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆనందపురం జంక్షన్‌కు వెళ్లే రహదారిలోని రైవాడ కాలువలో మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఆటో బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రైవాడ కాలువపై గతంలో నిర్మించిన వంతెన కూలిపోవడంతో స్థానికులు రాకపోకలకు అనువుగా తాత్కాలిక వంతెనను నిర్మించారు. ఇటీవల ఇదే ప్రాంతంలో లారీ బోల్తా కొట్టింది. ఇపుడు ఇదే కాలువలో ఆటో బోల్తాపడింది. ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఉన్నప్పటికి ఎవరికీ ప్రమాదం జరగలేదు.

వంతెన పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

లక్కవరపుకోట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎల్.కోట, జామి మండలాల ప్రజల దశాబ్దాల కాలం నాటి కల నెరవేరబోతోంది. మంగళవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు వంతెన శ్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ వంతెన పూర్తయితే ఎల్.కోట మండలం నాయుడుపేట, వీరభద్రపేట గ్రామాల మీదుగా జామి మండలం లక్ష్మీపురం, జామి గ్రామాలను సులువుగా చేరుకునే అవకాశం కలుగుతుంది. ఎమ్మెల్యే సహకారంతో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు పనులను చేపట్టి పర్యవేక్షణ చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణంపై రెండు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేబీఏ రాంప్రసాద్, మల్లా రామకృష్ణ, కరెడ్ల శ్రీను, రాయవరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతకు సత్కారం



రంగనాథం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథంను రాజాంకు చెందిన తృప్తి మిత్రమండలి సభ్యులు మంగళవారం సత్కరించారు. ఆయన నివాసంలో ఉపాధ్యాయురాళ్లు కోరాడ శిరీష, లాభాన సుజాత ఆధ్వర్యంలో రంగనాథం దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు గార రవిప్రసాద్, సూర్యశైలజ. షన్ముఖశ్రీనివాస్, ఉపాధ్యాయులు చిప్పాడ కృష్ణప్రసాద్ బలివాడ నాగేశ్వరరావు, వంతరాం ప్రదీప్, లాభాన వేణు, కూరాడ హరి. మూడడ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి బాడీ బిల్డర్స్‌కు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

గరివిడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గరివిడికి చెందిన బాడీ బిల్డర్స్ వై.వి.ప్రసాద్, రామహంతి రమణిప్రియా అంతర్జాతీయ క్రీడల్లో సత్తాచాటి బంగారు పతకాలు సాధించారు. నేపాల్ దేశం పోకోరాలో ఏప్రిల్ 3 నుంచి 7 వరకు అంతర్జాతీయ క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఇండియా, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. మహిళా విభాగంలో పాల్గొన్న రమణిప్రియా పవర్‌లిఫ్టింగ్ కాంపిటేషన్‌లో 330 కేజీల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలిచారు. అలాగే అథ్లెటిక్స్ విభాగంలో షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో కూడా రెండు బంగారు పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో పాల్గొన్న వై.వి.ప్రసాద్ పవర్ లిఫ్టింగ్ పోటీలో 400 కేజీల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలిచి స్వర్ణపతకాన్ని, 50 మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకం, వంద మీటర్ల స్విమ్మింగ్ పోటీల్లో రజతం గెలిచి విజేతలుగా నిలిచారు. విజేతలు శిక్షణ పొందుతున్న గరివిడిలోని రాయల్ జిమ్ నిర్వాహకులు గజపతిరాజు శ్వేత అభినందించారు.

డిప్యూటీ సీఎంను కలుద్దామని..



గిరిజనులను నియంత్రిస్తున్న పోలీసులు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంగళవారం అరకు పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఆయన్ని కలుద్దామని మండలంలోని గిరిశిఖర గ్రామాల్లోని గిరిజనులు భావించారు. డోలీ బాధలు తప్పించాలని, రోడ్లు వేయించాలని కోరుతూ వినతిపత్రం అందజేయాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం పవన్‌కల్యాణ్ ప్రయాణించే రూట్‌లో మండలంలోని కాపుసోంపురం జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎదురుచూశారు. అయితే ఆయన్ని కలవలేకపోయారు. డిప్యూటీ సీఎం అత్యవసరంగా సింగపూర్ వెళ్లాల్సి ఉండటంతో గిరిజనులు కలిసే అవకాశం లేకుండా పోయిందని జనసేన వర్గాలు తెలిపాయి.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడికి సత్కారం



రవికుమార్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల జిల్లా సంఘం అధ్యక్షుడు కలిశెట్టి రవికుమార్‌ను ఉత్తరాంధ్ర విద్యార్థిసేన, తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు పొలవలస రమణమూర్తి, మజ్జి అప్పారావు అభినందించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన న్యాయవాద వృత్తి సమాజానికి అవసరమన్నారు. విలువలతో కూడిన న్యాయవాద వృత్తికి మంచి గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు మీసాల నాగేశ్వరరావు, రామారావు, నారాయణరావు, సీనియర్ న్యాయవాదులు త్రినాథరావు, ఈశ్వరరావు తదితరులున్నారు.

స్త్రీనిధి రుణాల్లో రూ.3.75లక్షల స్వాహా

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ముత్తావలస గ్రామంలోని పొదుపు సంఘాలలో జరిగిన అక్రమాల్లో రూ.3.75లక్షలు స్వాహా అయినట్టు వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి స్పష్టంచేశారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో ఈ విషయంపై మాట్లాడారు. ముత్తావలస పొదుపు సంఘాల్లో జరిగిన అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు గతంలో అధికారులు విచారణ చేపట్టారని, ఈ విచారణలో వీవోఏ సీతాదేవి అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారని ఆమె తెలిపారు. మొత్తం రూ.3.75 లక్షలు స్వాహా చేసినట్టు గుర్తించారని ఆమె వెల్లడించారు. అయితే వారి నుంచి కొంత మేరకు సొమ్మును రికవరీ చేసి, విధుల నుంచి తప్పించారని ఏపీఎం తెలిపారు. సుమారు మూడు నెలలు కిందట ముత్తావలసలో స్త్రీనిధి రుణాల మంజూరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఒకరి పేరున రుణం వాడి మరొకరికి ఇచ్చారని, వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సిన సొమ్ము సక్రమంగా చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారని ఆ గ్రామానికి చెందిన కొంత మంది సభ్యులు ఫిర్యాదులు చేశారని ఆమె తెలిపారు. ఈ మేరకు స్త్రీనిధి మేనేజర్ ఉమామహేశ్వరరావుతో పాటు తాను పలుమార్లు బహిరంగ విచారణ చేపట్టామన్నారు. ఈ మేరకు ఏడు సంఘాలలో చోటుచేసుకున్న అక్రమాలను గుర్తించి, చర్యలు చేపట్టామని చెప్పారు. మరో మూడు సంఘాల సభ్యులను విచారించాల్సి ఉందని ఏపీఎం తెలిపారు.

ఇంటి పన్ను వసూళ్లు ముమ్మరం చేయాలి

రామభద్రపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఇళ్ల పన్నుల వసూళ్లు ముమ్మరం చేయాలని ఈవోపీఆర్డీ మరడ వెంకటరమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 22 పంచాయతీల్లో రూ.46లక్షల 22వేల 698లు ఈ ఏడాది వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.37లక్షల 67వేల 55లు వసూలు చేశామని తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా ఇంటి పన్నుల వసూళ్లు పూర్తిచేయాలన్నారు. అలాగే నాన్‌ట్యాక్స్ డిమాండ్ కింద రూ.60లక్షల 90వేల 447లు వసూలు చేయాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ చిట్టూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

బొబ్బిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం తెలపడం చాలా అన్యాయమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలు కె.విజయగౌరి అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక షాదీఖానాలో లౌకిక, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.శంకరరావు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విజయగౌరితో పాటు పీపీఐ, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు కండాపు ప్రసాదరావు, ఇంతియాజ్, వి.లక్ష్మునాయుడు, రామకృష్ణ, జయరాజ్ తదితరులు మాట్లాడారు. ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలపై దాడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. రాజ్యాంగ లౌకిక హక్కులకు భిన్నంగా ప్రభుత్వం చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. వక్ఫ్ భూములను కాజేసేందుకు ముస్లింయేతరులను బోర్డులోనికి చొప్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్.గోపాలం, శివ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

● కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

బొబ్బిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కటికి అప్పలనాయుడు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం పరామర్శించారు. స్థానిక పూల్‌బాగ్‌లోని అప్పలనాయుడు నివాసానికి వెళ్లి, పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ఓదార్చారు. ఎమ్మెల్యే తోపాటు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు రౌతు రామూర్తి, ఎల్.జగన్నాథం, పోల సత్యంనాయుడు, పెంట స్వామినాయుడు తదితరులు ఉన్నారు.

వ్యతిరేకించినా పట్టించుకోలేదు..

(ఐదో పేజీ తరువాయి)

కల్పించడం కోసం 200మంది రైతుల పొట్ట కొట్టొద్దని కోరారు. సభ ముగిశాక డీఆర్‌వో మాట్లాడుతూ ప్రజలు క్వారీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్న విషయం ప్రభుత్వ దృష్టిలో పెడతామని చెప్పడంతో వారంతా క్వారీ రాదని ఆనందపడ్డారు. కానీ ఏడాది తర్వాత ఇక్కడ క్వారీ ఏర్పాటు చేసేశారు. గత ప్రభుత్వంలో పెద్దలు కాసులకు కక్కుర్తి పడి ప్రజల అభిప్రాయాలకు విలువలేకుండా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు.

క్వారీ నిర్వహణపై అనుమానాలు..

● క్వారీకి సీఎఫ్‌వో,సీఎఫ్ఈ అనుమతులు ఉండాలి. ఎప్పటికప్పుడు మైనింగ్‌శాఖ పర్యవేక్షించాలి. ఈ రెండూ జరగడం లేదు.

● క్వారీ యాజమాన్యాలు నచ్చినట్టు రిగ్‌బ్లాస్టింగ్ చేసి తవ్విన గోతులను తిరిగి బుగ్గితో మూసి తాము ఎటువంటి తవ్వకాలు చేయలేదని నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

● రాయల్టీపై అధికారుల పరిశీలన లేదు. ఎంత తవ్వారు.. ఎంత విక్రయించారు.. ప్రభుత్వానికి రాయల్టీ ఎంత చెల్లించారు అనేదానిపై అధికారిక సమాచారం లేదు.

● బ్లాస్టింగ్ అనుమతి పొందిన క్వారీల్లో బ్లాస్టింగ్ సామగ్రి నిల్వ ఉంచేందుకు గోదాములు ఉండాలి. ఇక్కడ లేవు. ఎస్.కోట మండలంలో ఆరుకు పైగా క్వారీలు ఉన్నా ఎక్కడా గోదాములు లేవు.

● మైనింగ్ సేఫ్టీ లేదు. క్వారీకి రెండు వందల మీటర్ల పరిధిలో ఇళ్లు ఉండకూడదు. అలాగే పనిచేస్తున్న సిబ్బందికి భద్రతతో కూడిన వస్తువులు ఇవ్వడం లేదు.

ఉత్తుత్తి హామీలు!

(ఐదో పేజీ తరువాయి)

సరిగా పండడం లేదంటున్నారు. విసిగివేసారి గిరిజనులు పలుమార్లు క్వారీ పేలుళ్లను అడ్డుకున్నారు. కేసులు బనాయిస్తామని నిర్వాహకులు బెదరిస్తున్నారు. ఇదిలా ఉండగా రిగ్గుల సాయంతో 100 అడుగులకు పైగా రంధ్రాలు చేసి బ్లాస్టింగ్‌లు చేపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రెండేళ్లుగా క్వారీ నిర్వాహకులు మరింత దారుణంగా వ్యవహరిస్తున్నారన్నది గిరిజనుల ఆరోపణ.

ఎంతో చేస్తామన్నారు..

తాగునీటి సౌకర్యం కల్పిస్తామని, గిరిజన యువతకు ఉపాధి చూపుతామని, ప్రజారోగ్యం కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. క్వారీ అనుమతుల కోసం ఇక్కడికి వచ్చిన అధికారులు క్వారీ ఏర్పాటు తర్వాత ఏం జరుగుతోందనేది కనీసం తెలుసుకోవడం లేదు. భారీ బ్లాస్టింగ్‌ల వల్ల భూకంపం వచ్చినట్టు భూమి కంపిస్తోందని, ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వారు వాపోతున్నారు. వారిని అడ్డుకుంటే పోలీస్ కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారంటూ పెదదుంగాడకు చెందిన వరపల రాజన్నదొర, వరపల అప్పన్నదొర, జుత్తాడ అచ్చుతరావు, నాగమణి, కొప్పల శివాజీ, శివ, వరపల రాజు తదితరులు 'ఆంధ్రజ్యోతి' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమ పరిస్థితిని పట్టించుకోకుంటే కలెక్టర్ కార్యాయం వద్ద ఆందోళన చేపడతామని గిరిజన నాయకుడు వరపల సన్యాసిరావు అధికారులను హెచ్చరించారు.

కలి'విడిగా'..

(ఐదో పేజీ తరువాయి)

ఎంపీ మాత్రం ఒకరే ఉన్నారు.

ఆ ఇద్దరూ పక్కపక్కనే ఉన్నా...

చింత శంకర్రావుది రాజాం మండలం వి.ఆర్.అగ్రహారం కాగా.. తూర్పున అతని ఇంటిని ఆనుకుని ఉన్న పెంకి రమణది వి.ఆర్.పేట. ఇద్దరివీ రెండు మండలాలు, రెండు నియోజకవర్గాలు, రెండు జిల్లాలకు చెందిన వారు.. అయినా అవేవీ వారికి పట్టవు..కలిసి మెలిసి జీవించడం, కష్టసుఖాల్లో పాలు పంచుకుని సాఫీగా జీవితాలను సాగిస్తున్నారు.

● వీఆర్ అగ్రహారంలో సుమారు 1150 మంది జనాభా ఉండగా, 807 మంది ఓటర్లున్నారు. డబ్బాడ ఆదిలక్ష్మి సర్పంచి. వీఆర్‌పేటలో సుమారు 300 మంది జనాభా ఉండగా, 180 మంది ఓటర్లున్నారు. బత్తుల స్వాతి సర్పంచిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

గ్యాస్ ధర తగ్గించండి

● సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



బొబ్బిలి: సిలిండర్లకు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మహిళలు

బలిజిపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం నాయకుడు గేదెల సత్యనారాయణ, మండల నాయకుడు యమ్మల మన్మథరావు తదితరులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: వంట గ్యాస్ సిలెండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ.50 పెంచడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని కాంగ్రెస్ పార్టీ కురుపాం నియోజకర్గం కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశన్ని అంటగా, గ్యాస్ ధరను కూడా పెంచడం దారుణమన్నారు. ● బొబ్బిలి రూరల్: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జె.రంగరాయపురం గ్రామంలో సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఎల్పీజీ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణం అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి తిరునాథు, రెడ్డి తులసమ్మ తదితరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి: వంటగ్యాస్ సిలెండర్ల ధరను రూ.50 పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బొబ్బిలి పట్టణంలోని 30వ వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు వినూత్న తరహాలో నిరసన తెలిపారు. మహిళలంతా సిలెండర్లకు, మోదీకి దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.శంకరరావు, జి.శంకరరావు, పద్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

● వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

కొమరాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోగ లక్షణాలను సకాలంలో గుర్తించి వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కేఆర్‌బీ పురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. గ్రామీణ స్థాయిలో గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణులను సకాలంలో గుర్తించడంతో పాటు సాధారణ ప్రసవాలను పీహెచ్‌సీల్లో జరిగేటట్లు చూడటంపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలన్నారు. అలాగే ఎన్‌సీడీ సర్వే ఏ మేరకు పూర్తి చేశారో ఆయా సచివాలయ గ్రామాల వారీగా పరిశీలించారు. గ్రామీణ స్థాయిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేటట్లు వైద్య సిబ్బంది చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సీహెచ్ అరుణ్‌కుమార్, బి.శామ్యూల్, ఎపిడెమిక్ ఈవో ఎల్.సత్తిబాబు, సీహెచ్‌వో బంగారుబాబు, పీహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వద్దు

గరుగుబిల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు హెచ్చరించారు. మండలంలోని దళాయివలస, ఉద్దవోలు, శివరాంపురం గ్రామాల పరిసరాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలకు ఆనుకుని ఉన్న మురుగు కాలువల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, రక్షిత పథకాల ప్రాంతంలో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై అలసత్వం వహించరాదన్నారు. ఈ పరిశీలనలో సర్పంచ్ జి.నారాయణమ్మ, కార్యదర్శి సీహెచ్‌వీ కూర్మినాయుడు ఉన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి ఆహ్వానం

భామిని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్య సంవత్సరానికి మొదటి సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశానికి ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాలల ఎస్‌వీఎల్ నారాయణరావు కోరారు. ఈమేరకు మంళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, తెలుగు, ఇంగ్లీష్, ఒరియా మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలో ప్రవేశానికి అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు టెన్త్ హాల్‌టికెట్, ఆధార్‌కార్డులతో కళాశాలకు వచ్చి తమకు నచ్చిన గ్రూప్‌ను నమోదు చేసుకోవాలని సూచించారు.

కొఠియాలో ఉచిత వైద్య శిబిరం

సాలూరు రూరల్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూపు గ్రామాల గిరిజనులకు సాలూరు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నేరేళ్లవలసలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్య నిపుణులు పాల్గొని,గిరిజనులకు వైద్య సేవలు అందించారు. గిరిజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 190 మందికి వైద్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 60 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 350 మంది ఆహార పొట్లాలు అందజేశారు. వంద మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

ఉపాధి పనులు కల్పించండి

గజపతినగరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కల్పించాలని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు వేతనదారులు ఎంపీడీవో బి.కల్యాణిని కోరారు. మంగళవారం వారు ఎంపీడీవోను కలిసి మాట్లాడారు. ఉపాధి పనులు కల్పించిక పోవడంతో ఆర్థిక ఇబ్బం దులకు గురవుతున్నామన్నారు. 11 గ్రూపులు ఉన్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్ సీతమ్మ పనులు కల్పించడం లేదని ఫిర్యాదు చేశారు. అందుకు ఎంపీడీవో సానుకూలంగా స్పందించారు. పను కల్పనకు చర్యలు చేపడతానన్నారు. భూదేవి పేటలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీవో కృష్ణవేణిని ఆదేశించారు.

కౌలు రైతులపై చిత్తశుద్ధి చూపండి

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేసి వారిపై ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలని అఖిల భారత రైతు కూలీసంఘం కోరింది. మంగళవారం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ కొత్తఅడ్డతీగలో కౌలు రైతులు సమావేశం నిర్వహించారు. సమగ్ర కౌలు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి మల్లేసు, సభ్యులు దాలిబాబు, ముత్యాలు, పార్వతి తదితరులు ఉన్నారు.

వ్యర్థాల తొలగింపు

మక్కువ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంపై ఈనెల 6న 'ముక్కు మూసుకోవాల్సిందే' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడి వ్యర్థాలను ప్రొక్లయినర్ సహాయంతో తొలగించి, ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డుకు తరలించారు. అనంతరం బీసీ కాలనీవాసులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యర్థాలను రహదారి పక్కన పడవేయవద్దని, ఇంటి ముందు ప్లాస్టిక్ తొట్టెలలో వేయాలని సూచించారు. పంచాయతీ ఈవో కె.సురేష్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

రేగిడి పాఠశాలలో పరిణామాలపై విచారణ చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యం పేరిట పురుష ఉపాధ్యాయులు గిరిజన బాలికలను బయటకు, ప్రైవేటు ఆసుపత్రికి, ఆర్ఎంపీల వద్దకు తీసుకొని వెళ్లారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాలికల పాఠశా లల్లో పురుష ఉపాధ్యాయులను నియమించడమే అనేక సమస్యలకు కారణమని వివరించారు. రేగిడి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, మహిళా డిప్యూటీ మేట్రిన్ ఉండగా పురుష ఉపాధ్యాయులు బాలికలను వైద్యం పేరిట బయటకు ఎందుకు తీసుకెళ్లారని వారు ప్రశ్నించారు. అసలు ప్రైవేటు ఆసుపత్రికి, ఆర్ఎంపీల వద్దకు ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. పురుష ఉపాధ్యాయులు పాఠశాలలో లేకుండా విచారణ జరపాలని, అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేదెప్పుడు?

● సీపీఐ నాయకుల ఆందోళన

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేదెప్పుడని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ అనంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అలాగే గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలిచ్చి, గ్రామాలను అందుబాటులో ఉండే పంచాయతీలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో భూకబ్జాలపైన, ఇందిరమ్మ కాలనీలో బినామీ ఇంటి పట్టాల వ్యవహారంపైన సమగ్ర విచారణ జరిపించాలని డిమండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.రవికుమార్, డివిజన్ కార్యదర్శి వి.శ్రావణకుమార్ పాల్గొన్నారు.

● గజపతినగరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో తహసీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని డిమాండ్ చేసారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు రాయితీతో కూడిన రుణం అందజేయాలన్నారు. అనంతరం డీటీ శోభకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ నాయకులు పురం అప్పారావు ఉన్నారు.

చిన్నారులకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల లోపు చిన్నారులకు ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. మండలంలోని ఎం.బూర్జవలస, జగన్నాథపురం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా సచివాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఆధార్ నమోదు వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

● రాజాం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీయ్యపేటలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. సచివాలయం పరిధిలో జీరో నుంచి 6 ఏళ్ల చిన్నారులకు మాత్రమే ఆధార్ నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

బొబ్బిలి/రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్లను నెరవేర్చాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరామినాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, జీపీఎఫ్, సరెండర్ లీవుల బకాయిలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం సెప్టెంబరు 2024 ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురుకుల ఉద్యోగులకు, మోడల్ స్కూల్ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్జిక్యూటివ్ మెంబర్ డి.వెంకట నాయుడు పాల్గొన్నారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

లక్కవరపుకోట, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామసభలు సకాలంలో సక్రమంగా నిర్వహించాలని కోరుతూ డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి మంగళవారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గేదెల శ్రీరామ్మూర్తి, సంఘ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగంలోని 243 అధికరణను అనుసరించి ప్రతీ మూడు నెలలకు గ్రామసభలను నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా ప్రజలను భాగస్వాములను చేసి పాలనను పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీఆర్‌వో సానులకూలంగా స్పందించారు. అన్ని పంచాయతీలకు సమాచారం పంపిస్తామన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వసతులు కల్పించండి

శృంగవరపుకోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకుడు మద్దిల రమణ, గాడి అప్పారావు కోరారు. మంగళవారం కాపుసోంపురం నుంచి గిరిజనులతో ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. అనంతరం ఎంపీడీవో సతీష్‌కు వినతిపత్రం అందించారు. దారపర్తి సర్పంచ్ సన్నిబాబు, మాజీ సర్పంచ్ బుచ్చన్న, ఎర్రయ్య, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

గరుగుబిల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికం గా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. సంతోషపురంలో నిర్మిస్తున్న చేపల చెరువు పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పండ్ల తోటలు, భూముల అభివృద్ధి, నీటి కుంటల పనులకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్టు ఆమె తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి



గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయం తోపాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తోందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. తామరఖండి గ్రామంలో పల్లె పండుగలో భాగంగా నిర్మించిన మినీ గోకులాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు వేణుగోపాలనాయుడు, పెంట సత్యం, డోకల సీతమ్మ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నార్లవలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

సాలూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నార్లవలస ఫీల్డ్ అసిస్టెంట్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గాసి తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతికి మంగళవారం వినతిపత్రం అందించారు. కూలీలకు పని ఇవ్వడం లేదని, పనులు చేసిన వారికి కూలి చెల్లింపుల్లో జాప్యం చేస్తున్నారని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సుందరరావు, చినబాబు, నాగేశ్వరరావు, రాము, సన్యాసిరావు పాల్గొన్నారు.

కంప్యూటర్ సామగ్రి వితరణ

పార్వతీపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని వసతిగృహాల్లో కంప్యూటర్ల వినియోగార్థం యూనియన్ బ్యాంకువారు ప్రింటర్లు, స్కానర్లు అందజేశారని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. రూ.లక్ష విలువైన ప్రింటర్లు, స్కానర్లను మంగళవారం స్థానిక ఐటీడీఏ పీవో కార్యాలయ ప్రాంగణంలో బ్యాంకు ప్రతినిధులు పీవోకు అందజేశారు. యూబీఐ శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం అధికారులు, బెలగాం యూనియన్ బ్యాంక్ మేనేజర్ పాల్గొన్నారు.

చెరకు క్రషర్ సామగ్రి దగ్ధం

బాడంగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గొల్లాది గ్రామంలో బొబ్బిలి అప్పలనాయుడుకు చెందిన క్రషర్ సామగ్రి, చెరకు పిప్పు దగ్ధమైనట్లు ఆర్ఐ జగదాంబ తెలిపారు. మంగళవారం సాయంత్రం క్రషర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సామగ్రి పూర్తిగా దగ్ధం అయ్యిందని, సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించిందని అంచనా వేశారు. బాడంగి అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఘటనా స్థలాన్ని వీఆర్వో సుశీల, సీనియర్ అసిస్టెంట్ కల్యాణ్ చక్రవర్తి పరిశీలించి, వివరాలు సేకరించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సీతానగరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుచ్చిమి, కాశీపేట, పణుకుపేట, అంటిపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లను, బర్లి గ్రౌండు పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈ బి.లక్ష్మణరావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జేఈ జి.చంద్రమౌళి, టెక్నికల్ అసిస్టెంట్ త్రినాథరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పాలకొండ ఎంవీఐ వేణుగోపాలరావు, అసిస్టెంట్ ఎంవీఐ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం సీతంపేట బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు వారు పలు సూచనలు, సలహాలు అందించారు.